

## నుమాయిష్..హౌస్‌ఫుల్

అబిడ్స్, జనవరి 13: నుమాయిష్ సందర్శకులతో కిటకిటలాడుతున్నది. సంక్రాంతి సెలవులతో రద్దీ మరింత పెరిగింది. ఎగ్జిబిషన్ రైలులో జర్నీ చేస్తూ. సందడి చేస్తున్నారు నగరవాసులు. స్టాళ్లను పరిశీలించి.. నచ్చిన వస్తువులను కొనుగోలు చేస్తున్నారు. ఇప్పటి వరకు ఎగ్జిబిషన్‌ను దాదాపు మూడు లక్షలకు పైగా సందర్శించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు వనం సత్యేందర్, కార్యదర్శి హనుమంతరావు, కోశాధికారి రాజేందర్‌కుమార్ తెలిపారు.



శంషాబాద్ వద్ద కల్వర్టు గుంతలో పడిపోయిన వాహనాలు



# పండుగ పూట..

# విషాదం

*సంక్రాంతి పండుగ వేళ.. పలు కుటుంబాల్లో విషాదం నెలకొంది. గ్రేటర్‌లో వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృత్యువాతపడగా, పతంగి సరదా ఓ బాలుడి ప్రాణం తీసింది. అలాగే జోగులాంబ గద్వాల జిల్లా వద్ద ప్రైవేటు బస్సు బోల్తాపడి.. మంటలంటుకొని నగరానికి చెందిన ఓ మహిళ సజీవదహనమయ్యారు.*

- అత్తాపూర్‌లో పతంగి ఎగురవేస్తూ.. కరెంట్ షాక్‌తో బాలుడి దుర్మరణం
- తల్లీకొడుకుల ప్రాణం తీసిన అతివేగం..
- హైదరాబాద్-బెంగళూరు జాతీయ రహదారిపై ఢీకొన్న కారు..బైకు..ఆటో
- మల్లంపేటలో బైక్‌ను ఢీకొట్టిన టిప్పర్ యువకుడి మృతి
- జోగులాంబ గద్వాల్ వద్ద ప్రైవేటు బస్సు బోల్తా.. నగరవాసి సజీవదహనం



## బైక్‌పై వెళ్తుండగా

దుండిగల్, జనవరి 13: దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మల్లంపేటకు చెందిన ముఖేశ్(21) శుక్రవారం రాత్రి బైక్‌పై బాచుపల్లి వైపు వస్తుండగా మల్లంపేట్ కమాన్ వద్ద ఎదురుగా వేగంగా దూసుకొచ్చిన టిప్పర్ ఢీ కొట్టింది. ప్రమాదంలో ముఖేశ్ అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## వేగంగా వచ్చి.. అదుపు తప్పి..

శంషాబాద్ రూరల్, జనవరి 13 :హైదరాబాద్– బెంగళూరు జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. అతివేగంగా వచ్చిన కారు అదుపు తప్పి బైక్‌ను ఢీకొట్టగా, ఆ ద్విచక్రవాహనం ముందు వెళ్తున్న ఆటోను ఢీకొంది. ఈ ఘటనలో మూడు వాహనాలు రోడ్డు పక్కన నిర్మాణంలో ఉన్న కల్వర్టు గుంతలో పడిపోయాయి. ప్రమాదంలో ఇద్దరు మృతిచెందగా, ముగ్గురికి గాయాలయ్యాయి. ఘాన్సీమియాగూడ గ్రామ సమీపంలో ఈ విషాద ఘటన చోటు చేసుకున్నది. శంషాబాద్ రూరల్ సీఐ శ్రీనాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. కారులో ప్రయాణిస్తున్న రీసెర్చ్ సెంటర్ శాస్త్రవేత్త ఈసీఐఎల్‌లో ఉంటున్న మేరువ ఆదిశేషారెడ్డి (57) ఆయన తల్లి రాములమ్మ(88) చనిపోయారు. సంక్రాంతి పండుగ కోసం వీరు నంద్యాల జిల్లా జిల్లెల్ల గ్రామానికి వెళ్తుండగా, ప్రమాదానికి గురై మృత్యువాతపడ్డారు. ద్విచక్ర వాహనంపై వెళ్తున్న సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ నారాయణపేట్‌కు చెందిన అంజి, చిన్నారి అక్షిత, ఆటో డ్రైవర్‌తో పాటు అందులో ప్రయాణిస్తున్న కార్మికులు రియాజ్, ఫారుఖ్‌కు గాయాలయ్యాయి. కాగా, రోడ్డు ప్రమాదంతో దాదాపు నాలుగు కిలోమీటర్ల వరకు ట్రాఫిక్ జామ్ అవ్వగా, పోలీసులు క్లియర్ చేశారు.

## 36 ప్రాజెక్టులు..

# ₹4305 కోట్లు

### ఎస్‌ఆర్‌డీపీ-2కు నిధులివ్వండి

### సర్కారుకు జీహెచ్‌ఎంసీ ప్రతిపాదనలు

సిటీబ్యూరో, జనవరి 13 (నమస్తే తెలంగాణ) : రెండో దశ వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి ప్రాజెక్టు (ఎస్‌ఆర్‌డీపీ)పై బల్దియా దృష్టి సారించింది. తొలి విడత 47 పనుల్లో రూ. 3248.53 కోట్లు వెచ్చించి.. 36 ప్రాజెక్టులు అందుబాటులోకి తెచ్చారు. ఆర్‌అండ్‌బీ, జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో 11 చోట్ల పనులు తుది దశలో ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే రెండో దశలో ఎక్కువగా ఆర్‌యూబీ, ఆర్వోబీలకు ప్రాధాన్యత ఇచ్చారు. ఈ మేరకు రూ. 4305 కోట్ల వ్యయంతో 36 చోట్ల పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేసి.. నిధుల కేటాయింపుపై ప్రభుత్వానికి జీహెచ్‌ఎంసీ నివేదిక అందజేసింది. ప్రత్యేక గ్రాంటు లేదా రుణాల గ్యారెంటీపై సర్కారు నుంచి అనుమతి వస్తుందని అధికారులు చెబుతున్నారు. త్వరలో జీహెచ్‌ఎంసీపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష ఉంటుందని, ఇందులో స్పష్టత వచ్చే అవకాశాలున్నాయని అంచనా వేస్తున్నారు.

## బోల్తాపడి.. మంటలంటుకొని..

సిటీబ్యూరో, జనవరి 13 (నమస్తే తెలంగాణ): జోగులాంబ గద్వాల జిల్లా వద్ద ఓ ప్రైవేటు బస్సు బోల్తాపడి.. మంటలంటుకొని నగరానికి చెందిన ఓ మహిళ సజీవ దహనమయ్యారు. సంక్రాంతి నేపథ్యంలో నగరంలోని వివిధ ప్రాంతాల్లో నివాసముండే పలువురు సొంతూళ్లకు వెళ్లేందుకు జగన్ ట్రావెల్స్‌లో టికెట్లను బుక్ చేసుకుని శుక్రవారం రాత్రి చిత్తూరుకు బయలుదేరారు. అయితే జోగులాంబ గద్వాల జిల్లా వద్దకు చేరుకోగానే తెల్లవారుజాము సుమారు 3 గంటల సమయంలో బస్సు పల్టీకొట్టి బోల్తాపడింది. బస్సుకు మంటలు అంటుకోవడంతో నగరానికి చెందిన మాలతి సజీవ దహనమయ్యారు. మరో నలుగురు ప్రయాణికులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదంతో నగరంలో విషాదఛాయలు అలముకున్నాయి.

## చిన్నారిని మింగిన సంక్రాంతి పతంగి

బండ్లగూడ, జనవరి 13 : స్నేహితులతో కలిసి గాలిపటం ఎగరేస్తూ.. ఓ బాలుడు విద్యుదాఘాతంతో చనిపోయాడు. ఈ విషాద ఘటన అత్తాపూర్‌లో జరిగింది. ఇన్‌స్పెక్టర్ పులి యాదగిరి తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీవాణి అపార్ట్‌మెంట్‌లో నివాసముండే అభిషేక్ అన్న కొడుకు తనిష్క్ ఇక్కడే ఉంటూ చదువుకుంటున్నాడు. శనివారం తనిష్క్ స్నేహితులతో కలిసి అపార్ట్‌మెంట్ భవనంపై పతంగులు ఎగురవేసేందుకు వెళ్లాడు. అక్కడ ఏసీ యంత్రం తగలడంతో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



తనిష్క్



కైట్ ఫెస్టివల్‌ను ప్రారంభించి పతంగులను ఎగురవేస్తున్న మంత్రులు జూపల్లి, పొన్నం





## స్వీట్స్ అండ్ కైట్స్ కలర్ ఫుల్



*పరేడ్ గ్రౌండ్‌లో అంతర్జాతీయ కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్ శనివారం కలర్ ఫుల్‌గా ప్రారంభమైంది. మూడు రోజుల పాటు జరిగే ఈ ఫెస్టివల్‌లో వివిధ రకాల ఫుడ్ కోర్టులు, హస్తకళలు, చేనేత వస్త్రాల స్టాళ్లు ఏర్పాటు చేశారు. నింగిని తాకేలా.. ఎగిరిన విభిన్న ఆకృతుల గాలిపటాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి.*

## కరెంటు తీగలతో

# జాగ్రత్త



**బహిరంగ ప్రదేశాల్లోనే పతంగులు ఎగురవేయాలి**

సిటీబ్యూరో, జనవరి 13 (నమస్తే తెలంగాణ): సంక్రాంతి పండగ రోజు పతంగులు ఎగురవేసే సమయంలో ప్రజలు సురక్షిత ప్రాంతాలను ఎంచుకోవాలని, విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద గాలిపటాలను ఎగురవేయవద్దని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫరూఖీ సూచించారు. మాంజాలు విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లపై పడి ప్రమాదాలు, విద్యుత్ అంతరాయాలు కలిగే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా పట్టణాల్లో పతంగులు ఎగురవేసే వారు ప్రత్యేకంగా జాగ్రత్తలు తీసుకోవాలంటూ.. పలు సూచనలు ఇచ్చారు.



టీఎస్‌ఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ

- విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లకు దూరంగా బహిరంగ ప్రదేశాల్లో, మైదానాల్లో మాత్రమే గాలిపటాలు ఎగురవేయాలి.
- కరెంటు లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, సబ్ స్టేషన్ల వద్ద పతంగులు ఎగురవేయడం ప్రమాదకరం. ఒక వేళ పతంగులు కానీ, మాంజాలు కానీ విద్యుత్ లైన్లపై ఇతర పరికరాలపై పడితే సరఫరాలో అంతరాయంతో పాటు ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది.
- కాటన్, నైలాన్, లెనిన్‌తో చేసిన మాంజాలను మాత్రమే వాడండి. మెటాలిక్ మాంజాలు వాడొద్దు. మెటాలిక్ మాంజాలు విద్యుత్ వాహకాలు.. అవి లైన్లపై పడితే షాక్ కొట్టే అవకాశం ఉంది.
- బాల్కనీ, గోడల మీద నుంచి పతంగులు ఎగురవేయరాదు. ఇది చాలా ప్రమాదకరం.
- విద్యుత్ పరికరాలు, తీగలపై పతంగులు, మాంజాలు పడినా.. వైర్లు రోడ్డుపై పడినా.. తాకకుండా విద్యుత్ శాఖ నం. 1912కి లేదా సమీప విద్యుత్ కార్యాలయానికి, యాప్ లేదా వైబ్ సైట్ (www.tssouthernpower.com) కు సమాచారం అందించాలి.



## నేడు లోహ్రి మేళా

సిటీబ్యూరో, జనవరి 13 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్ర పంజాబీ సేవా సమితి ఆధ్వర్యంలో నేడు లోహ్రి మేళా నిర్వహిస్తున్నట్లు సమితి కన్వీనర్ సునీల్ పూరి తెలిపారు. శనివారం అబిడ్స్‌లోని పంజాబీ సేవా సమితి కార్యాలయంలో ఆయన వివరాలు వెల్లడించారు. సంస్థ ఏర్పడి 25 ఏండ్లు అయిన సందర్భంగా సిల్వర్ జూబ్లీ వేడుకలను సికింద్రాబాద్‌లోని మహబూబ్ కళాశాలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. వివిధ స్టాళ్లు, పలు రకాల పంజాబీ ఫుడ్ ఐటెమ్స్ మేళాలో ఉంటాయని చెప్పారు. అనంతరం కార్యక్రమానికి సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు.

## కొవిడ్ లేకున్నా..

# 7.5 లక్షలు వసూలు

### వైద్య దంపతులకు అధికంగా బిల్లు

### డబ్బులు తిరిగి వాపస్ ఇవ్వాల్సిందే..

### ప్రైవేటు ఆస్పత్రికి వినియోగదారుల కమిషన్ ఆదేశం




నాంపల్లి కోర్టులు, జనవరి 13 (నమస్తే తెలంగాణ) : వైద్య దంపతులకు కొవిడ్-19 టెస్టు నెగెటివ్ ఉన్నా.. చికిత్సలు చేసి అధికంగా బిల్లు వేసిన ఓ ప్రైవేటు ఆస్పత్రికి జరిమానా విధించింది వినియోగదారుల కమిషన్. కొవిడ్ సమయంలో వైద్య దంపతులు కరోనా వచ్చిందనే అనుమానంతో ఓ వైద్యశాలలో చేరారు. డిశ్చార్జి సమయంలో ఆస్పత్రి యాజమాన్యం వేసిన బిల్లు చూసి ఆశ్చర్యపోయారు. టెస్టులో నెగెటివ్ రిపోర్టు వచ్చినా.. నిబంధనలకు విరుద్ధంగా వైద్యుడికి రూ.4,76,000, ఆయన భార్యకు రూ. 2,67,514 ఆస్పత్రి యాజమాన్యం అధికంగా బిల్లు వేసింది. దీంతో దంపతులు జిల్లా వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు. ఈ క్రమంలో దంపతుల నుంచి వసూలు చేసిన డబ్బులను తిరిగి వారికి వాపస్ ఇవ్వాలని కమిషన్ తీర్పు వెలువరించింది. లక్ష రూపాయల నష్టపరిహారాన్ని వైద్యుడికి, ఆయన భార్యకు రూ.50వేలు, ఖర్చులకు 15వేల రూపాయలు అదనంగా చెల్లించాలని పేర్కొంది. డబ్బును 45 రోజుల్లోగా ఫిర్యాదుదారులకు చెల్లించాలని ఆదేశించింది.



## 22 నుంచి ఉచిత ప్లాస్టిక్ సర్జరీ శిబిరం

కాచిగూడ, జనవరి 13: సీతారాంబాగ్‌లోని డాక్టర్ ఈశ్వర్ చందర్ చారిటబుల్ ట్రస్ట్ దవాఖానలో ఈ నెల 22 నుంచి ఫిబ్రవరి 5 వరకు గ్రహణం మొర్రి, కాలిన గాయాలతో అవయవాల వంకర్లు సరిచేయడం, జన్యుపర లోపంతో శరీరంపై వెంట్రుకల పెరుగుదల నివారణకు ఉచిత ప్లాస్టిక్ సర్జరీ శిబిరాన్ని నిర్వహిస్తున్నామని రాంకీ ఫౌండేషన్ చైర్మన్ మువ్వ రామ్‌రెడ్డి, గ్రీన్స్ లయన్స్ క్లబ్ ప్రతినిధులు విద్యాభూషణ్, డాక్టర్ గులాబీ రాణి, పరావస్తు క్రియేటివ్ ఫౌండేషన్ ప్రతినిధి గద్దె భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 7816079234, 9848241640లో సంప్రదించాలని సూచించారు.



## సంక్రాంతి వచ్చిందే తుమ్మెదా..

కొండాపూర్, జనవరి 13 : మాదాపూర్‌లోని శిల్పారామంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా శనివారం గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసులు, బుడబుక్కలు, జంగమదేవరులు, కొమ్ముదాసరులు, సోదమ్మ, పిట్టల దొరల వంటి జానపద కళారూపాలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. అనంతరం విదూషి అపర్ణ శంకర్, సుష్మిత శిష్య బృందాలు ప్రదర్శించిన నృత్యరూపకాలు అలరించాయి. ఆదివారం భోగి పళ్ల ఉత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.